సాక్షి వరంగల్

ఆదివారం । 18 । ఆగస్టు । 2024



మెరిసిన కీర్తిసురేష్

హనుమకొండ నక్కలగుట్టలో ఆభరణాల రిటైల్‌రంగంలో అగ్రగామిగా నిలుస్తున్న సంస్థ జోస్ ఆలుక్కాస్ నూతన షోరూంను సినీనటి కీర్తి సురేష్ ప్రారంభించారు. - 8లో▸



భవితకు నవోదయం.. - 8లో▸

రాబోయే విద్యా సంవత్సరానికి జవహర్ నవోదయ విద్యాలయంలో ఆరో తరగతిలో ప్రవేశానికి నోటిఫికేషన్ విడుదల చేశారు.

గరిష్ఠం/కనిష్ఠం
33^0 / 26^0

వాతావరణం

జిల్లాలో ఉదయం వాతావరణం సాధారణంగా ఉంటుంది. పలు చోట్ల ఆకాశం మేఘావృతమై చిరుజల్లుల నుంచి మోస్తరు వర్షం కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

510 జీఓను సవరించాలి



గీసుకొండ: జాతీయ ఆరోగ్య మిషన్ ఉద్యోగులకు సంబంధించిన 510 జీఓను సవరించి న్యాయం చేయాలని మిషన్ ఉద్యోగుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రామ రాజేశ్‌కుమార్ కోరారు. ఈ మేరకు శనివారం హైదరాబాద్‌లో రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర నర్సింహను కలిసి వినతిపత్రం సమర్పించారు. మహిళా ఉద్యోగులకు వేతనంతో కూడిన 180 రోజుల మెటర్నరీ లీవు ఇవ్వాలని, ప్రతి నెలా ఒకటో తేదీన వేతనాలు ఇవ్వాలని కోరారు. రిటైర్మెంట్ అయిన వారికి నెలకు రూ.25వేల పెన్షన్ ఇవ్వాలని వినతిపత్రంలో పేర్కొన్నారు. ఆరోగ్యమిషన్ మిషన్ ప్రతినిధులు మురళీమోహన్, శ్రీనివాస్, సరికొండ సురేశ్‌గౌడ్, శ్రీమణి, లోకేశ్, రాధిక పాల్గొన్నారు.

పీఏసీఎస్ ఉద్యోగిపై సస్పెన్షన్ వేటు

చెన్నారావుపేట: చెన్నారావుపేట పీఏసీఎస్ పరిధిలోని పాపయ్యపేట ఎరువుల దుకాణంలో సేల్స్‌మెన్‌గా పనిచేస్తున్న మంచాల శ్రీనివాస్‌ను సస్పెండ్ చేసినట్లు జిల్లా సహకార శాఖ అధికారి సంజీవరెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. గ్రామంలోని సొసైటీ గోదాం (ఎరువుల దుకాణం) నుంచి 74 ఎరువుల బస్తాలను రైతులకు పంపిణీ చేయకుండా అక్రమంగా మహబూబాబాద్ జిల్లా గూడూరు మండల కేంద్రంలోని లక్ష్మీ గణేశ్ ఫర్టిలైజర్ షాపునకు విక్రయించిన విషయం విధితమే. కాగా ఏడీఏ నగేశ్, చెన్నారావుపేట వ్యవసాయ అధికారి శశికాంత్‌లు విచారణ చేసి అందించిన నివేదిక ఆధారంగా మంచాల శ్రీనివాస్‌ను సస్పెండ్ చేసినట్లు వెల్లడించారు. ఇన్‌చార్జ్ సేల్స్‌మెన్‌గా సొసైటీ సీఈఓ బాధ్యతలు చిట్టె రవికి అప్పగించినట్లు పేర్కొన్నారు.

చౌటపల్లి పీఏసీఎస్ సీఈఓ..

పర్వతగిరి: మండలంలోని చౌటపల్లి పీఏసీఎస్ సీఈఓ వెంకటయ్యను విధుల నుంచి సస్పెండ్ చేసినట్లు జిల్లా సహకార అధికారి సంజీవరెడ్డి శనివారం తెలిపారు. చౌటపల్లి పీఏసీఎస్ పరిధిలో రైతుల రుణ మాఫీకి సంబంధించి ప్రభుత్వ నిబంధనలు పాటించడంలో నిర్లక్ష్యం వహించడంతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు ఉత్తర్వులో పేర్కొన్నారు. దీంతోపాటు ఇటీవల రుణాలు మాఫీ అయిన రైతుల వద్ద నుంచి రైతు వాటా ధనం రుసుం రూపంలో డబ్బులు వసూళ్లు చేశారని రైతులు ఆరోపణ చేయడంతో సస్పెండ్ చేసినట్లు తెలిపారు.

దరఖాస్తుల ఆహ్వానం

వరంగల్: వరంగల్ జిల్లాలోని ఒకటి నుంచి పదో తరగతి వరకు చదువుతున్న దివ్యాంగ విద్యార్థులు ప్రీ మెట్రిక్ స్కాలర్‌షిప్ కోసం దరఖాస్తు చేసుకోవాలని జిల్లా సంక్షేమ శాఖ అధికారి హైమావతి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇంటర్ నుంచి పోస్ట్ గ్రాడ్యుయేషన్ చదువుతున్న దివ్యాంగ విద్యార్థులు పోస్ట్ మెట్రిక్ స్కాలర్‌షిప్ కోసం ఆగస్టు 31వ తేదీలోగా, అత్యున్నత తరగతి విద్య స్కాలర్ షిప్ కోసం అక్టోబర్ 31వ తేదీలోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకోవాలని సూచించారు. డిపార్ట్‌మెంటు వెబ్‌సైట్ www.depwd.gov.inలో నేషనల్ స్కాలర్ షిప్ పోర్టల్ www.scholarships.gov.inలో దరఖాస్తు చేసుకోవాలని ఆమె సూచించారు.

కేయూ డిగ్రీ ఇన్‌స్టంట్ పరీక్ష



కేయూ క్యాంపస్: కేయూ పరిధిలో ఉమ్మడి వరంగల్, ఖమ్మం, ఆదిలాబాద్ జిల్లాల్లోని పలు పరీక్ష కేంద్రాల్లో శనివారం డిగ్రీ (బీఏ, బీకాం, బీఎస్సీ, తదితర కోర్సుల)కు సంబంధించి ఇన్‌స్టంట్ పరీక్ష నిర్వహించారు. డిగ్రీ కోర్సుల ఆరో సెమిస్టర్‌లో ఒక సబ్జెక్ట్‌లో ఫెయిలైన విద్యార్థులకు ఈ ఇన్‌స్టంట్ పరీక్ష నిర్వహించినట్లు పరీక్ష విభాగాధికారులు తెలిపారు.

ఆర్టీసీ లక్కీ డ్రా విజేతల ఎంపిక



హన్మకొండ: ఆర్టీసీ లక్కీ డ్రా విజేతలను శనివారం డ్రా తీసి ఎంపిక ప్రకటించారు. హనుమకొండ డిపోకు చెందిన డీలక్స్ బస్సుల్లో ప్రయాణించిన మహిళా ప్రయాణికుల నుంచి హనుమకొండ జిల్లా బస్ స్టేషన్‌లో వరంగల్ రీజినల్ మేనేజర్ డి.విజయభాను ప్రయాణికులతో డ్రా తీయించి విజేతలను ప్రకటించారు. కార్యక్రమంలో హనుమకొండ డిపో మేనేజర్ బి.ధరంసింగ్, బస్టాండ్ ఏఎంటీ ఎ.స్వామి, హనుమకొండ డిపో మెకానికల్ సూపర్‌వైజర్ వి.చంద్రశేఖర్ పాల్గొన్నారు.

వరంగల్‌లోని కాకతీయ మెడికల్ కాలేజీ ఎదుట ఆందోళన చేస్తున్న వైద్యులు, వైద్యవిద్యార్థులు





పెల్లుబికిన నిరసన

- వైద్యవిద్యార్థిని హత్య కేసు నిందితుల్ని కఠినంగా శిక్షించాలి
- ఐఎంఏ నుంచి కేఎంసీ వరకు వైద్యులు, 'జూడా'ల భారీ ర్యాలీ
- ప్రైవేట్ ఆస్పత్రుల్లో ఓపీ సేవలు బంద్.. ప్రభుత్వ ఆస్పత్రుల్లో యథావిధిగా..

వైద్యులకు జాతీయస్థాయి ప్రత్యేక చట్టం తేవాలని డిమాండ్



ప్లకార్డుతో నిరసన వ్యక్తంచేస్తున్న వైద్య విద్యార్థిని



పబ్లిక్ గార్డెన్‌లో కొవ్వొత్తులతో నిరసన తెలుపుతున్న 'జూడా'లు

ఎంజీఎం : పశ్చిమ బెంగాల్‌లో ఓ వైద్యవిద్యార్థినిపై అత్యంత క్రూరంగా అత్యాచారం చేసి చంపిన ఘటనపై జరుగుతున్న ఆందోళనలు ఉధృతమయ్యాయి. జూనియర్ డాక్టర్లు ఓ పక్క విధులు బహిష్కరించి నాలుగు రోజులుగా వివిధ రూపాల్లో నిరసన తెలుపుతున్న క్రమంలో వారికి ఇండియన్ మెడికల్ అసోసియేషన్ (ఐఎంఏ), నర్సింగ్ విద్యార్థులు, వివిధ పార్టీల నాయకులు మద్దతు తెలిపారు. శనివారం కాకతీయ మెడికల్ కళాశాల, ఎంజీఎం ఆస్పత్రిలో విధులు నిర్వర్తిస్తూ జూనియర్ డాక్టర్ల ఆందోళనలో కరీంనగర్‌కు చెందిన జూనియర్ విద్యార్థులు సైతం పాల్గొన్నారు. ఇండియన్ మెడికల్ అసోసియేషన్ నుంచి కాకతీయ మెడికల్ కళాశాలకు వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం కేఎంసీ ప్రధాన గేటు ఎదుట పెద్దఎత్తున నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు.

ప్రత్యేక చట్టాన్ని తెస్తేనే వైద్యులకు రక్షణ

వైద్యులకు వైద్యవిద్యార్థుల రక్షణ కోసం కేంద్ర ప్రభుత్వం జాతీయస్థాయిలో ప్రత్యేక చట్టాన్ని తేవాలని ఐఎంఏ ప్రతినిధులు డిమాండ్‌చేశారు. నేషనల్ మెడికల్ కౌన్సిల్ కళాశాల అనుమతులకు చేస్తున్న తనిఖీల సందర్భంలో వైద్యులకు రక్షణ కల్పించేలా ఉన్న కళాశాలలకే అనుమతులు ఇవ్వాలని డిమాండ్‌చేశారు. ఎంజీఎం, కేఎంసీ ఆస్పత్రుల్లో సైతం జూనియర్ వైద్యులకు విశ్రాంతి గదులు, తాగునీటి సౌకర్యం, మౌలిక సదుపాయాలు కల్పించాలన్నారు.

ప్రైవేట్ ఆస్పత్రుల్లో ఓపీ సేవల నిలిపివేత...

వైద్యవిద్యార్థిని అత్యాచారం, హత్యాకాండను నిరసిస్తూ ఇండియన్ మెడికల్ అసోసియేషన్ రాష్ట్ర వ్యాప్త పిలుపులో భాగంగా శనివారం వరంగల్ ఐఎంఏ ఆధ్వర్యంలో ప్రైవేట్ ఆస్పత్రుల్లో ఓపీ సేవల నిలిపివేతకు పిలుపునిచ్చారు. దీంతో జిల్లాలోని ప్రైవేట్ ఆస్పత్రులు ఉదయం 6నుంచే ఓపీ సేవలు బహిష్కరించాయి. ఈ ఓపీ సేవల బంద్ ఆదివారం ఉదయం 6 గంటల వరకు కొనసాగుతుందని తెలిపారు. రోగులకు ఎమర్జెన్సీ సేవలను కొనసాగిస్తున్నట్లు ఐఎంఏ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ అన్వర్ తెలిపారు.

హనుమకొండ ప్రభుత్వ ప్రసూతి ఆస్పత్రిలో..

హన్మకొండ చౌరస్తా: వైద్య విద్యార్థి హత్య ఘటనను ఖండిస్తూ శనివారం హనుమకొండలోని ప్రభుత్వ ప్రసూతి ఆస్పత్రిలో వైద్య సిబ్బంది నల్ల బ్యాడ్జీలతో నిరసన తెలిపారు. నిరసనలో ప్రొఫెసర్ డాక్టర్ రాజేశ్వరీ, జీఎంహెచ్ ఆర్ఎంఓ డాక్టర్ అంబరీష్, నర్సింగ్ సూపరింటెండెంట్ దయాశీల, యూనియన్ ఆస్పత్రి కమిటీ కార్యదర్శి పుల్లా కిషన్, అధ్యక్షులు కవిత, నర్సింగ్ విద్యార్థినులు, పాల్గొన్నారు. నిరసనలో భాగంగా సాధారణ వైద్య సేవలు నిలిపివేయగా, నెలలు నిండిన 28 మంది గర్భిణులకు వైద్య పరీక్షలు చేసి అడ్మిట్ చేశారు. మధ్యాహ్నం 3 గంటల వరకు ఆస్పత్రిలో 8 ప్రసవాలు జరిగినట్లు సిబ్బంది తెలిపారు. అదేవిధంగా రెడ్డి కాలనీలోని ఈఎస్ఐ డిస్పెన్సరీ ఆస్పత్రిలో సిబ్బంది ప్లకార్డులు, నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. జూనియర్ డాకర్లు రాత్రి హనుమకొండ పబ్లిక్‌గార్డెన్‌లో కొవ్వొత్తులతో నిరసన ధర్నా నిర్వహించారు.

వైద్యుల ఆందోళనలో సైకో వీరంగం



వైద్యవిద్యార్థులు కేఎంసీ వద్ద ఆందోళన చేస్తున్న క్రమంలో ఓ సైకో వీరంగం సృష్టించాడు. మద్యం మత్తులో బ్లేడ్‌తో తన ఒంటి నిండా రక్తం మరకలతో ఆందోళన స్థలానికి రావడంతో ఒక్కసారిగా అందరూ ఆందోళనకు గురయ్యారు. విషయాన్ని గ్రహించిన మట్టెవాడ ఇన్‌స్పెక్టర్ తుమ్మ గోపి వెంటనే ఆ వ్యక్తిని అదుపులోకి తీసుకుని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు.



జీఎంహెచ్ ఎదుట నల్లబ్యాడ్జీలతో నిరసన తెలుపుతున్న వైద్యసిబ్బంది



స్టాప్ వాయిలెన్స్ అంటూ నిరసన తెలుపుతున్న జూనియర్ డాక్టర్లు

పోడు రైతుల ప్రయోజనాలకు భంగం కలిగించొద్దు

- వీడియో కాన్ఫరెన్స్‌లో మంత్రి కొండా సురేఖ



వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్ సత్యశారద, అదనపు కలెక్టర్ సంధ్యారాణీ, డీఎఫ్ఓ అనుజ్‌అగర్వాల్

వరంగల్: పోడు రైతుల ప్రయోజనాలు దెబ్బతినకుండా, వారి ఉపాధికి భంగం కలగకుండా అటవీశాఖ మార్గదర్శకాలను అనుసరిస్తూ పోడు భూముల రక్షణకు కృషి చేయాలని రాష్ట్ర అటవీ, పర్యావరణ, దేవాదాయశాఖ మంత్రి కొండా సురేఖ అన్నారు. మంత్రి సురేఖ హైదరాబాద్‌లోని సచివాలయం నుంచి శనివారం రాష్ట్ర మంత్రి సీతక్కతో కలిసి పోడు భూములపై అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ కాన్ఫరెన్స్‌లో జిల్లా కలెక్టరేట్ నుంచి కలెక్టర్ డాక్టర్ సత్య శారద, ఆదనపు కలెక్టర్ సంధ్యారాణి, డీఎఫ్ఓ అనుజ్ అగర్వాల్ పాల్గొన్నారు. రాష్ట్రంలో ఇప్పటివరకు ఆమోదించిన ఆర్ఓఎఫ్ఆర్ దరఖాస్తులు పట్టాలు లబ్ధిదారుకి చేరిన వివరాలు అందించాలని అధికారులను ఆదేశించారు. ఇప్పటివరకు పంపిణీ చేసిన పోడు పట్టాల వివరాలు, పెండింగ్ ఉన్న దరఖాస్తులు, ప్రస్తుతం క్షేత్ర స్థాయిలో సాగు అవుతున్న అటవీ భూముల వివరాలతో కూడిన నివేదిక అటవీశాఖ, గిరిజన శాఖ, రెవెన్యూ శాఖ అధికారులు సంయుక్తంగా రూపొందించి సమర్పించాలని మంత్రి ఆదేశించారు. పోడు భూముల పట్టా కోసం పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులు క్షేత్రస్థాయిలో పరిశీలించాలని, అర్హత ఉంటే వారికి పట్టా పంపిణీకి చర్యలు తీసుకోవాలని తెలిపారు. దరఖాస్తును తిరస్కరించే పక్షంలో దానికి గల కారణాలను స్పష్టంగా తెలియజేస్తూ నివేదిక అందించాలని పేర్కొన్నారు. ఈ వీసీలో ఆర్డీఓ కృష్ణవేణి, డీటీడీఓ సౌజన్య, అధికారులు పాల్గొన్నారు.

అర్హుల వివరాలు ఓటరు జాబితాలో నమోదు

- రాష్ట్ర ముఖ్య ఎన్నికల అధికారి సి.సుదర్శన్‌రెడ్డి



వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్, కమిషనర్, అడిషనల్ కలెక్టర్

వరంగల్: 18సంవత్సరాలు నిండిన అర్హులందరి వివరాలు ఓటరు జాబితాలో నమోదు చేస్తూ పకడ్బందీగా జాబితా రూపొందించాలని రాష్ట్ర ముఖ్య ఎన్నికల అధికారి సుదర్శన్‌రెడ్డి ఆదేశించారు. శనివారం ఆయన హైదరాబాద్‌లోని సీఈఓ కార్యాలయం నుంచి అదనపు సీఈఓ లోకేశ్‌కుమార్‌తో కలిసి ఓటరు జాబితా సవరణ-2025పై అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. వరంగల్ జిల్లా కలెక్టరేట్ వీడియో సమావేశ మందిరం నుంచి జీడబ్ల్యూఎంసీ కమిషనర్ డాక్టర్ అశ్వినీ తానాజీ వాకడే, అదనపు కలెక్టర్ సంధ్యారాణిలతో కలసి కలెక్టర్ డాక్టర్ సత్య శారద వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా సి.సుదర్శన్ రెడ్డి మాట్లాడుతూ.. జనవరి 1, 2025 ప్రామాణికంగా ఓటరు జాబితా సవరణ -2025 నిర్వహించాలని అన్నారు. ఆగస్టు 20నుంచి బీఎల్ఓలు ఇంటింటి సర్వే చేపట్టాలన్నారు. 18సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరికీ ఓటరు జాబితాలో చోటు కల్పించేలా కార్యాచరణ అమలు చేయాలని తెలిపారు. ఓటరు జాబితాలో ఉన్న మల్టీ ఎంట్రీలను తొలగించాలని, ఓటర్ కార్డుపై ఉన్న పొరపాట్లు పరిష్కరించాలని కలెక్టర్లకు సూచించారు. రాష్ట్ర వ్యాప్తంగా పెండింగ్‌లో ఉన్న ఫారం 8 దరఖాస్తులను త్వరగా పరిష్కరించాలని సీఈఓ ఆదేశించారు. ఈ కాన్ఫరెన్స్‌లో ఆర్డీఓ కృష్ణవేణి, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి



రికార్డులను పరిశీలిస్తున్న డాక్టర్ అమర్‌సింగ్

రాయపర్తి: సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని తెలంగాణ రాష్ట్ర వైద్యారోగ్యశాఖ అడిషనల్ డైరెక్టర్ డాక్టర్ అమర్‌సింగ్ సూచించారు. శనివారం రాయపర్తి మండలకేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించి సిబ్బందికి పలు సూచనలిచ్చారు. ప్రాథమిక ఆరోగ్యకేంద్రం అధికారులు, సిబ్బంది సమయపాలన పాటించాలని సూచించారు. రాయపర్తి ప్రాథమిక ఆరోగ్యకేంద్రం పరిధిలో ఎన్ని డెంగీ కేసులు నమోదయ్యాయనే విషయంపై ఆరా తీశారు. వ్యాధిగ్రస్తుల గృహాలను సందర్శించి వైద్యపరమైన సూచనలు చేశారు. ప్రతీ ప్రాథమిక ఆరోగ్యకేంద్ర పరిధిలో యాంటీ లార్వా, దోమల నివారణ పిచికారీ మందులు అందుబాటులో ఉంచాలని ఆదేశించారు. కార్యక్రమంలో డీఎంహెచ్ఓ వెంకటరమణ, మెడికల్ ఆఫీసర్ వనజ, సిబ్బంది పాల్గొన్నారు.

పోలీస్ ప్రతిష్టను పెంచాలి: సీపీ



సమీక్షిస్తున్న సీపీ అంబర్ కిషోర్ ఝా

మామునూరు: పోలీసులు అంకిత భావంతో పని చేసి పోలీస్ శాఖ ప్రతిష్టను పెంచాలని వరంగల్ సీపీ అంబర్ కిషోర్ ఝా ఆదేశించారు. ప్రజలు పోలీసులపై పెట్టిన నమ్మకానికి తగినట్లుగా పని చేయాలని, ఫిర్యాదుదారుల పట్ల మర్యాదపూర్వకంగా వ్యవహరించాలని సూచించారు. ఈమేరకు శనివారం ఖిలా వరంగల్ మండలం మామునూరు సబ్ డివిజన్ ఏసీపీ కార్యాలయాన్ని సీపీ ఆకస్మికంగా తనిఖీ చేశారు. రికార్డులు పరిశీలించారు. పెండింగ్ కేసుల దర్యాప్తు స్థితిగతులపై ఏసీపీని అడిగి తెలుసుకున్నారు. అధికారుల పని తీరుపై సమీక్ష సమావేశం నిర్వహించారు.. ఈసందర్భంగా సీపీ మాట్లాడుతూ.. పోలీస్ ప్రతిష్టకు భంగం కలిగించే రీతిలో అధికారులు వ్యవహరిస్తే సహించేది లేదన్నారు. 100కు వచ్చే ఫిర్యాదులపై స్టేషన్ అధికారులు తక్షణమే స్పందించి త్వరితగతిన బాధితులకు సాయం అందించాలని, పోలీస్‌స్టేషన్‌కు వచ్చే ఫిర్యాదుదారులతో మర్యాదపూర్వకంగా వ్యవహరించాలని సూచించారు.

కుమారుడి పెళ్లి చూడకుండానే..





వెంకట్‌నారాయణ, రంజిత్ మృతదేహాలు



ప్రమాదానికి కారణమైన ఆర్టీసీ బస్సు

- రోడ్డు ప్రమాదంలో తండ్రి, పెద్దనాన్న కుమారుడి మృతి
- బైక్‌ను ఢీ కొట్టిన ఆర్టీసీ బస్సు
- పెళ్లి కార్డులు పంచివస్తుండగా ఘటన




షాక్‌కు గురైన పెళ్లి కొడుకు అశోక్

గీసుకొండ: కన్నకొడుకు పెళ్లి చేసి ఆశీర్వదించాలని ఆశపడిన తండ్రి కల నెరవేరకుండానే రోడ్డు ప్రమాదం రూపంలో వచ్చిన మృత్యువు బలితీసుకుంది. కుమారుడి పెళ్లి కార్డులు పంచేందుకు అన్న కొడుకుతో కలిసి వెళ్లగా.. ఇరువురూ విగతజీవులుగా మారారు. ఘటనకు సంబంధించి గీసుకొండ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. హనుమకొండ జిల్లా ఐనవోలు మండలం ఒంటిమామిడిపల్లి గ్రామానికి చెందిన మజ్జిగ దేవేంద్ర- వెంకట్‌నారాయణ(52) దంపతుల కుమారుడు అశోక్ వివాహం ఈ నెల 22న జరిపించేందుకు నిర్ణయించారు. ఈనేపథ్యంలో పెళ్లి శుభలేఖలు పంచడానికి వెంకటనారాయణ, అతడి అన్న కొడుకు మజ్జిగ రంజిత్(25)తోపాటు పెళ్లి కొడుకు అశోక్ దుగ్గొండి మండలం తొగర్రాయిలోని బంధువుల ఇంటికి వెళ్లారు. తిరుగు ప్రయాణంలో వెంకటనారాయణ, రంజిత్‌లు బైక్‌పై స్వగ్రామానికి వెళ్తుండగా.. రాత్రి 9.45గంటల సమయంలో ఎదురుగా వస్తున్న హనుమకొండ డిపో చంద్రుగొండ ఆర్టీసీ బస్సు వీరి బైక్‌ను వరంగల్- నర్సంపేట రహదారిపై ఓంకార్ ఫంక్షన్ హాల్ వద్ద ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో బైక్‌పై ప్రయాణిస్తున్న ఇద్దరు అక్కడికక్కడే మృతి చెందాడు. వారి వెనకాలే వస్తున్న పెళ్లికొడుకు అశోక్.. తన తండ్రి, సోదరుడు మృతి చెందటంతో షాక్‌కు గురయ్యాడు. పోలీసులు బస్సును గీసుకొండ పోలీస్‌స్టేషన్‌కు తరలించగా డ్రైవర్ పరారీలో ఉన్నట్లు తెలిసింది. గీసుకొండ సీఐ బాబూలాల్ సిబ్బందితో కలసి వెళ్లి ఘటనా స్థలాన్ని పరిశీలించి మృతదేహాలను అంబులెన్స్‌లో వరంగల్ ఎంజీఎం ఆస్పత్రికి తరలించారు.

'ఎంజీఎం' స్ఫూర్తితో ఇతర జిల్లాల్లోనూ..

ట్రాన్స్‌జెండర్ క్లినిక్‌ల ఏర్పాటుకు అడుగులు..

- ఎంజీఎంలో రెండేళ్ల నుంచి 600మందికిపైగా వైద్యసేవలు
- లేజర్ ట్రీట్‌మెంట్ కోసం ఇతర జిల్లాలు, రాష్ట్రాల నుంచి రాక
- ఇక్కడి సేవలపై అధ్యయనం



ఎంజీఎంలోని ట్రాన్స్‌జెండర్ క్లినిక్



ట్రాన్స్ జెండర్ లైలాకు కౌన్సెలింగ్ ఇస్తున్న కౌన్సిలర్ డాక్టర్ కీర్తి సతీశ్‌కుమార్(ఫైల్)

సాక్షి, వరంగల్: వరంగల్‌లోని మహాత్మాగాంధీ మెమోరియల్ (ఎంజీఎం) ఆస్పత్రిలో రెండేళ్ల క్రితం ట్రాన్స్‌జెండర్ల (హిజ్రాలు) కోసం ఏర్పాటుచేసిన ప్రత్యేక క్లినిక్ అందిస్తున్న సేవలను స్ఫూర్తిగా తీసుకున్న రాష్ట్ర ప్రభుత్వం అన్ని జిల్లాలోని ప్రభుత్వ ఆస్పత్రుల్లో ఈ క్లినిక్‌ల ఏర్పాటు దిశగా అడుగులు వేస్తోంది. 2022 ఆగస్టు 2న ఎంజీఎంలో ట్రాన్స్‌జెండర్‌లకు ప్రత్యేక క్లినిక్ ఆరంభించారు. ఇప్పటికీ 600మందికిపైగా వైద్యచికిత్సలు అందించారు. ఇక్కడి సేవలను అధ్యయనం చేసిన ట్రాన్స్‌జెండర్ సాధికారత శాఖ, సంక్షేమ శాఖ, వైద్య, ఆరోగ్య శాఖ ఈ తరహా క్లినిక్‌లు రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ ఆస్పత్రుల్లో ఏర్పాటుచేయాలని నిర్ణయించింది. రాష్ట్రంలోని వరంగల్, కరీంనగర్, సూర్యాపేట, ఖమ్మం, భద్రాచలం, ఆదిలాబాద్, హైదరాబాద్, మేడ్చల్, రంగారెడ్డితోపాటు ఇతర జిల్లాలనుంచి ఎంజీఎంకు వచ్చి వైద్య చికిత్సలు తీసుకుంటున్నారని తేలింది. అలాగే ఆంధ్రప్రదేశ్ లోని విజయవాడ, అనకాపల్లి, మహారాష్ట్రలోని సూరత్ నుంచి వచ్చి ఇక్కడ ఎండోక్రైనాలజీ సంబంధిత వైద్యసేవలు తీసుకున్నట్లు గుర్తించారు. ముఖ్యంగా హార్మోన్ల అసమతుల్యత వల్ల ట్రాన్స్‌జెండర్ల శరీరంలో పుట్టుకొస్తున్న వెంట్రుకలను తొలగించేందుకు హెయిర్ రీమూవర్ లేజర్ ట్రీట్‌మెంట్ సేవలు తీసుకుంటున్నారు.

ప్రతీ మంగళవారం సేవలు

ట్రాన్స్‌జెండర్ల కోసం ఏర్పాటు చేసిన ఈక్లినిక్ ప్రతీ మంగళవారం ఉంటుంది. వారు ఆరోగ్య సమస్యలపై 99631 64111 నంబర్‌లో 24గంటలపాటు సంప్రదించవచ్చు. రెండేళ్ల నుంచి ఇప్పటివరకు 600మందికిపైగా సేవలందించాం. తొలుత కౌన్సెలింగ్ నిర్వహించి వారి ఆరోగ్య సమస్యను బట్టి సంబంధిత వైద్యుడికి రెఫర్ చేస్తాం. ప్రైవేట్ ఆస్పత్రులకు వెళ్తే భారీగా నష్టపోతారు.

- డాక్టర్ కీర్తి సతీష్ కుమార్, టీజీ క్లినిక్ కౌన్సిలర్

క్లినిక్‌ల ఏర్పాటు నిర్ణయం హర్షణీయం

రాష్ట్రంలోని ట్రాన్స్ జెండర్ల ఆరోగ్య సంరక్షణ కోసం అన్ని జిల్లాల్లోని ప్రభుత్వ ఆస్పత్రుల్లో ప్రత్యేక క్లినిక్‌లు ఏర్పాటుచేయాలన్న ప్రభుత్వ నిర్ణయాన్ని స్వాగతిస్తున్నాం. ఎంజీఎంలోని ప్రత్యేక క్లినిక్‌కు సుదూర ప్రాంతాల నుంచి వందల మంది వస్తున్నారు. ఎక్కడివారికి అక్కడే క్లినిక్ ఉంటే వ్యయప్రయాసలు తప్పుతాయి.

- లైలా, అధ్యక్షురాలు, తెలంగాణ హిజ్రా సంఘం

భద్రకాళి ఆలయ ఒకరోజు ఆదాయం రూ.6,55,446



హన్మకొండ కల్చరల్: భద్రకాళి ఆలయంలో ఈనెల 16న శుక్రవారం పూజా టికెట్లు, ప్రసాదాల విక్రయం ద్వారా ఒక్కరోజు ఆదాయం రూ.6,55,446 లభించిందని దేవాలయ ఈఓ, అసిస్టెంట్ కమిషనర్ శేషుభారతి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. శ్రావణ మాసం రెండో శుక్రవారాన్ని పురస్కరించుకుని వివిధ ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో దేవాలయాన్ని సందర్శించి అమ్మవారిని దర్శించుకోవడం వల్ల ఆదాయం సమకూరిందని పేర్కొన్నారు.

డేవిడ్ ఇజ్రాయిల్‌తో దీపక్ గార్గ్ భేటీ



హసన్‌పర్తి : ఆస్ట్రేలియాలోని మెల్‌బోర్న్ విశ్వ విద్యాలయ గ్లోబల్ ఎడ్యుకేషన్ స్ట్రాటజీ డైరెక్టర్ డేవిడ్ ఇజ్రాయిల్‌తో ఎస్సార్ యూనివర్సిటీ వీసీ దీపక్ గార్గ్ శుక్రవారం భేటీ అయ్యారు. డేవిడ్ ఇజ్రాయిల్ ఇటీవల తెలంగాణ రాష్ట్రంలో పర్యటించగా ఆయనను ఎస్సార్ యూనివర్సిటీ వీసీ దీపక్ గార్గ్ హైదరాబాద్‌లో కలిశారు. ఈ సందర్భంగా ఎస్సార్ యూనివర్సిటీలో బ్యాచిలర్ ఆఫ్ సైన్స్ అడ్వాన్స్‌డ్ ఆనర్స్ డ్యూయల్ డిగ్రీ ప్రోగ్రాం ప్రారంభించేందుకు భాగస్వామ్యం గురించి డేవిడ్ ఇజ్రాయిల్‌తో దీపక్ గార్గ్ చర్చించారు.

పీహెచ్‌డీ అడ్మిషన్లు పారదర్శకంగా చేపట్టాలి

● కేయూ ఇన్‌చార్జ్ వీసీ వాకాటి కరుణ



వీడియో కాన్ఫరెన్స్‌లో రిజిస్ట్రార్ మల్లారెడ్డి, వివిధ విభాగాల అధిపతులు, బీఓఎస్‌లు

కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీలో సోషల్‌సైన్స్, సైన్స్, ఫార్మసీ, కామర్స్, ఇంజనీరింగ్, ఎడ్యుకేషన్, లా, తదితర విభాగాల్లో 2021–2022లో ఇచ్చిన నోటిఫికేషన్ ప్రకారం ఇప్పటికే అడ్మిషన్ల ప్రక్రియ పూర్తికాగా లెఫ్ట్‌ఓవర్ వేకెన్సీల్లో మెరిట్ జాబితా ప్రకారమే పీహెచ్‌డీ అడ్మిషన్లను పారదర్శకంగా చేపట్టాలని కేయూ ఇన్‌చార్జ్ వీసీ వాకాటి కరుణ ఆదేశించారు. శనివారం హైదరాబాద్ నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా క్యాంపస్‌లోని పరిపాలన భవనంలో అకడమిక్ కమిటీ హాల్‌లో అన్ని విభాగాల డీన్లు, విభాగాల అధిపతులు, బీఓఎస్‌లతో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. వారం రోజుల్లో ఈ ప్రక్రియ పూర్తిచేయాలన్నారు.గతంలో నిర్వహించిన ప్రవేశపరీక్షల్లోని మెరిట్‌జాబితా ప్రకారంగానే పీహెచ్‌డీ అడ్మిషన్ల ప్రక్రియ పారదర్శకంగా పూర్తిచేయాలన్నారు. ఎలాంటి లోటుపాట్లు లేకుండా పూర్తిచేయాలని, పొరపాట్లు చేస్తే వారిపై చర్యలు తప్పవని హెచ్చరించారు. సమావేశంలో రిజిస్ట్రార్ పి. మల్లారెడ్డి, వివిధ విభాగాల డీన్లు టి. మనోహర్, ఎ. జ్యోతి, ఎన్. రాంనాథ్ కిషన్, జి. సమ్మయ్య, సదానందం, జి.హనుమంతు, ఎం.శ్రీనివాస్, అకడమిక్ విభాగం అసిస్టెంట్ రిజిస్ట్రార్ కోలశంకర్ తదితరులు పాల్గొన్నారు.

భవితకు నవోదయం..

● పల్లెల్లోని ప్రతిభావంతులకు నాణ్యమైన విద్య
● జవహర్ నవోదయ విద్యాలయం
● ఆరో తరగతికి దరఖాస్తుల ఆహ్వానం
● సెప్టెంబర్ 16 చివరి గడువు

ఖిలా వరంగల్ : ఉన్నత ప్రమాణాలతో కూడిన విద్య.. ఉత్తమ విలువలు.. దేశభక్తి.. క్రీడలు.. నైపుణ్యం.. ఇలా అన్ని అంశాల్లో నాణ్యమైన విద్యనందిస్తోంది ఖిలావరంగల్ మండలం మామునూరులోని జవహర్ నవోదయ విద్యాలయం. ఈ నేపథ్యంలో ఈ విద్యాలయంలో 2025–26 విద్యా సంవత్సరానికి సంబంధించి ఆరో తరగతిలో ప్రవేశానికి ఉమ్మడి వరంగల్ జిల్లాకు చెందిన ఐదో తరగతి చదువుతున్న విద్యార్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నారు.

ఆన్‌లైన్‌లో దరఖాస్తులు ..

ఎనిమిదేళ్లగా దరఖాస్తులను నవోదయ వెబ్‌సైట్ www.navodaya.gov.in ద్వారా ఆన్‌లైన్‌లో స్వీకరిస్తున్నారు. మొత్తం 80 సీట్లకు ఉమ్మడి వరంగల్ జిల్లా నుంచి గతేడాది 50 వేలకు పైగా దరఖాస్తులు వచ్చాయి. ఈ విద్యాసంవత్సరానికి సంబంధించ సెప్టెంబర్ 16న చివరి తేదీగా ప్రకటించారు. 2025 జనవరి 18న ప్రవేశ పరీక్ష నిర్వహించనున్నట్లు నవోదయ విద్యాలయం ప్రిన్సిపాల్ పూర్ణిమ ప్రకటించారు.

జాగ్రత్తలు తప్పనిసరి..

దరఖాస్తు సమయంలో చాలా మంది తప్పులు చేస్తుంటారు. విద్యార్థి గ్రామం, ఏ నవోదయ విద్యాలయ పరిధిలో బ్లాక్‌ల పరిధిలోకి వస్తుంది అనేది వెబ్ సైట్‌లో పొందుపరిచిన వివరాలతో మొదట పరిశీలించుకోవాలి. అది తెలియకుండా నచ్చిన 15 బ్లాక్‌ను ఎంపిక చేసుకుంటే సీట్లు కోల్పోవాల్సి వస్తుంది. కొంత మంది విద్యార్థులు గ్రామీణ, పట్టణ విషయంలో చాలా మంది తప్పులు చేస్తున్నారు. సీట్లు పొందినా గ్రామీణ ప్రాంతమనే సర్టిఫికెట్‌ను తీసుకురాలేకపోవడంతో సీట్లు కోల్పోవాల్సి వస్తోంది.



మామునూరులోని నవోదయ విద్యాలయం

చక్కటి గ్రంథాలయం ఏర్పాటు

ఆరో తరగతి నుంచే కంప్యూటర్ విద్యాబోధన. విద్యాలయ ప్రాంగణంలో అధునాతన వసతులతో కూడిన సుమారు 50 వేలకు పైగా పుస్తకాలు కలిగిన చక్కటి గ్రంథాలయం ఏర్పాటు చేశారు. డిజిటల్ తరగతి గదులతో పాటు విద్యార్థులకు ప్రత్యేక ట్యాబ్‌లు ఇస్తారు.

గర్ల్స్ ఎంపవర్‌మెంట్ కింద విజ్ఞానజ్యోతి పథకంలో భాగంగా తొమ్మిది నుంచి 12వ తరగతి అమ్మాయిలకు నీట్, ఐఐటీ–జేఈఈ కోచింగ్‌కు రూ.8వేలు ఇస్తారు. 12వ తరగతికి చెందిన 40 మంది విద్యార్థులకు నెలకు రూ.వెయ్యి చొప్పున ఏడాదిపాటు ఉపకార వేతనం అందజేస్తారు. పదో విద్యార్థులకు నూతన ఆవిష్కరణలు పోత్సహించేందుకు సైన్స్ కిట్ ఇస్తారు. స్వచ్ఛంద సంస్థల ద్వారా, ఆన్‌లైన్ ద్వారా ఉచిత ఐఐటీ కోచింగ్ తరగతులు నిర్వహిస్తారు.

సీట్ల కేటాయింపు ఇలా..

విద్యాలయంలో 80 సీట్లు ఉన్నాయి. వీటిలో 60 (75శాతం) గ్రామీణ ప్రాంత విద్యార్థులకు, 25 శాతం పట్టణ ప్రాంతవాసులకు కేటాయిస్తారు, వీటిలో 15 శాతం ఎస్సీ, 7.5 శాతం ఎస్టీ, 3 శాతం దివ్యాంగులు, బాలికలకు 1/3 వంతు రిజర్వేషన్‌ను సీట్ల కేటాయింపులో అమలు చేస్తారు. ఎంట్రన్స్ టెస్ట్ మార్కుల మెరిట్ ఆధారంగా ప్రవేశాలు కల్పిస్తారు.

అర్హులు ఎవరంటే..

3, 4, 5 తరగతులు ప్రభుత్వ గుర్తింపు పొందిన పాఠశాలలో చదివి ఉండాలి. ఐదో తరగతి తప్పనిసరిగా ఉమ్మడి వరంగల్ జిల్లాలో చదవాలి. అభ్యర్థులు 01-05-2013 నుంచి 31-07-2015 మధ్య జన్మించి ఉండాలి. అభ్యర్థి ఆధార్‌కార్డు తప్పనిసరిగా ఉండాలి. లేకుంటే తహసీల్దార్ కార్యాలయం నుంచి నివాస ధ్రువీకరణ పత్రం ఉండాలి.

సులభంగా సీటు పొందా..



నేను ప్రభుత్వ పాఠశాలలో చదివా. ఈసీటు నాకు వస్తుందా..? అని అపనమ్మకం ఉండేది. ఆరు నెలల పాటు క్రమశిక్షణ, పట్టుదలతో చదవడంతో సీటు సులభంగా పొందా. పాఠ్యాంశాలను బట్టీపట్టకుండా ప్రణాళిక ప్రకారం చదివితే విజయం సాధించొచ్చు.

– శ్రీవర్ధన్, ఆరో తరగతి విద్యార్థి

ఎంపిక పారదర్శకం



ప్రతి విద్యార్థికి ముందు క్రమశిక్షణ అలవాటు చేస్తాం. అన్ని రకాల సౌకర్యాలు కల్పిస్తాం. ఒత్తిడికి గురి కాకుండా సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తాం. ఈ ఏడాది అత్యధికంగా దరఖాస్తులు వచ్చేలా విస్తృత ప్రచారం చేస్తున్నాం. ప్రతిభను నమ్ముకుని కష్టపడి చదివితే ఉత్తీర్ణత సాధించొచ్చు.

– పూర్ణిమ, ప్రిన్సిపాల్ నవోదయ విద్యాలయం మామునూరు

హ్యాండ్లూమ్ కాలేజీ ఏర్పాటు శుభపరిణామం

● చేనేత కార్మికుల పిల్లలకు ఉజ్వల భవిష్యత్
● రాష్ట్ర చేనేత జౌళిశాఖ ఓఎస్‌డీ హిమజకుమార్

వరంగల్: తెలంగాణ రాష్ట్రంలో ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హ్యాండ్లూమ్ టెక్నాలజీ(ఐఐహెచ్‌టీ) కాలేజీ ఏర్పాటు కావడం శుభపరిణామని రాష్ట్ర చేనేత జౌళిశాఖ ఓఎస్‌డీ హిమజకుమార్ అన్నారు. శనివారం కొత్తవాడలోని పద్మశాలీ ఫంక్షన్ హాల్‌లో కాలేజీ ఏర్పాటుపై చేనేత కార్మికుల కుటుంబాలకు అవగాహన కల్పించారు. ఈఏడాది ప్రారంభం కానున్న చేనేత, టెక్స్‌టైల్స్ డిప్లొమా కోర్సుల్లో చేరే విద్యార్థులు 10తరగతి లేదా సమానమైన పరీక్షల్లో ఉత్తీర్ణులై ఉండాలన్నారు. 2024 జూలై 1నాటికి బీసీ, జనరల్ కేటగిరీ విద్యార్థులు గరిష్ట వయో పరిమితి 23 ఏళ్లు, ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు 25 ఏళ్లు ఉండాలన్నారు. దరఖాస్తులు ఈనెల 7 నుంచి 31వ తేదీ వరకు స్వీకరిస్తారని, మూడేళ్ల కోర్సులో ఆరు సెమిస్టర్లు ఉంటాయన్నారు. ఈ కాలేజీలోని ప్రతి విద్యార్థికి రాష్ట్ర ప్రభుత్వం రూ.2500 ఉపకార వేతనం ఇస్తుందని తెలిపారు. ఏడాదికి రూ.4,050 మాత్రమే ఫీజు చెల్లించాలన్నారు. హైదరాబాద్ నాంపల్లి సమీపంలోని శ్రీపొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం క్యాంపస్‌లో వసతి సదుపాయాలు కల్పిస్తారని తెలిపారు. వసతికయ్యే ఖర్చులను విద్యార్థి తల్లిదండ్రులు భరించాల్సి ఉంటుందన్నారు. అనంతరం పలువురు పద్మశాలీ కార్మిక సంఘాల నాయకులు మాట్లాడారు. రాష్ట్ర అటవీశాఖ మంత్రి కొండా సురేఖ చొరవతో వరంగల్ జిల్లాలో టెక్స్‌టైల్స్ ఇంజనీరింగ్ కాలేజీ ఏర్పాటు చేస్తే చేనేత కార్మికుల పిల్లలు ఈ కోర్సులో శిక్షణ పొంది కాకతీయ టెక్స్‌టైల్స్ పార్కులో ఉద్యోగాలు వస్తాయని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లినట్లు టీపీసీసీ చేనేత విభాగం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ చిప్ప వెంకటేశ్వర్లు తెలిపారు. దీంతో సీఎం రేవంత్‌రెడ్డి కేంద్ర ప్రభుత్వం నుంచి అనుమతులు తీసుకొచ్చి హైదరాబాద్‌లో ఈవిద్యా సంవత్సరంలోనే 60 సీట్లతో చేనేత, టెక్స్‌టైల్స్ టెక్నాలజీ డిప్లొమా కోర్సులను ప్రవేశపెట్టారని తెలిపారు. ఈ సదస్సుకు అధ్యక్షత వహించిన చేనేత, జౌళిశాఖ సహాయ సంచాలకుడు రాఘవరావు మాట్లాడుతూ పూర్తి చేసిన దరఖాస్తులు కమిషనర్ చేనేత, జౌళి శాఖ కార్యాలయం, చేనేత భవన్, మూడో అంతస్తు నాంపల్లి హైదరాబాద్‌కు రిజిస్టర్ పోస్టు ద్వారా గాని స్వయంగా అందించాలన్నారు. కార్యక్రమంలో డెవలప్‌మెంట్ ఆఫీసర్లు బొట్టు వెంకటేశ్వర్లు, బిజ్జా వెంకటేశ్వర్లు, డీసీసీ బ్యాంకు డైరెక్టర్ ఎలగం రవిరాజు, చేనేత సమాఖ్య అధ్యక్షుడు పంతగాని శ్రీనివాస్, మంత్రి లింగమూర్తి, సహకార సంఘాల అధ్యక్షులు ఎలగం పెద్ద భద్రయ్య, చిన్న భద్రయ్య, అడిగొప్పుల సంపత్, కూరపాటి సంపత్, పిట్టా రాములు, పరికిపండ్ల రమేశ్,ఎలగం సాంబయ్య, మాచబత్తుల కుమారస్వామి, శామంతుల శంకర లింగం, దానం రాజయ్య, లింగబత్తిని పురుషోత్తం, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న రాష్ట్ర చేనేత జౌళిశాఖ ఓఎస్‌డీ హిమజకుమార్

ఒక టీచర్.. ఇద్దరే విద్యార్థులు

● ఉన్న ఇద్దరూ గైర్హాజరు..
● సాయంత్రం వరకు ఒంటరిగా కూర్చున్న ఉపాధ్యాయుడు
● పాతతండా జీపీ ప్రభుత్వ పాఠశాలలో ఘటన

కేసముద్రం: ఓ ప్రభుత్వ పాఠశాలలో ఇద్దరే విద్యార్థులు చదువుకుంటున్నారు. వీరికి ఒక టీచర్ ఉన్నారు. అయితే ఉన్న ఇద్దరు విద్యార్థులు కూడా పాఠశాలకు గైర్హాజరు కావడంతో పాఠం బోధించడానికి ఎవరూ లేకపోవడంతో ఆ టీచర్ సాయంత్రం వరకు ఒంటరిగా కూర్చున్నాడు. ఈ ఘటన మహబూబాబాద్ జిల్లా ఇనుగుర్తి మండలం పాతతండాజీపీలో చోటుచేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి.. పాత తండా జీపీలోని ప్రాథమిక పాఠశాలలో గతేడాది 8 మంది విద్యార్థులున్నారు. ఈ క్రమంలో ఇనుగుర్తి ఎస్సీ కాలనీలోని ప్రాథమిక పాఠశాల నుంచి టీచర్ కోటేశ్వర్‌రావు ఈ పాఠశాలకు బదిలీ అయ్యాడు. తీరా స్కూల్‌కు వచ్చి చూస్తే విద్యార్థులు ఎవరూ లేరు. దీంతో తండాలోని ఇంటింటికీ వెళ్లి మీ పిల్లలను ప్రభుత్వ పాఠశాలకు పంపమని కోరుతూ వచ్చాడు. అప్పటికే తండాలోని విద్యార్థులు ప్రైవేట్ స్కూల్‌కు వెళ్తున్నారు. చివరకు ఇద్దరు పిల్లలను పంపడానికి తల్లిదండ్రులు అంగీకరించారు. అయితే ఆ ఇద్దరిలో ఓ విద్యార్థి స్కూల్‌కు రావడం లేదు. వస్తున్న ఒక్క విద్యార్థికి టీచర్ చదువు చెబుతున్నాడు. ఈక్రమంలో ఉన్న ఆ ఒక్క విద్యార్థికి జ్వరం రావడంతో శనివారం స్కూల్‌కు హాజరుకాలేదు. దీంతో ఆ టీచర్ ఉదయం నుంచి సాయంత్రం వరకు ఒంటరిగా కూర్చున్నాడు.



పాతతండాజీపీ ప్రాథమిక పాఠశాల



పాఠశాలలో ఒంటరిగా కూర్చున్న టీచర్

తాళం వేసి ఉన్న షాపులే టార్గెట్..

● వరుస చోరీలకు పాల్పడుతున్న దొంగ అరెస్ట్
● వివరాలు వెల్లడించిన ఇన్‌స్పెక్టర్ సత్యనారాయణరెడ్డి

వరంగల్ క్రైం: రాత్రి సమయంలో తాళం వేసి ఉన్న షాపుల్లో వరుస చోరీలకు పాల్పడుతున్న దొంగను అరెస్ట్ చేసినట్లు సుబేదారి ఇన్‌స్పెక్టర్ సత్యనారాయణరెడ్డి తెలిపారు. ఈ మేరకు శనివారం పీఎస్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన వివరాలు వెల్లడించారు. పీఎస్ పరిధిలోని హంటర్‌రోడ్డులో పోలీసులు వాహనాలు తనిఖీ చేస్తున్నారు. ఈ క్రమంలో హనుమకొండ దీన్‌దయాల్ నగర్‌కు చెందిన భూతరాజు సందీప్ అనుమానాస్పదంగా కనిపించాడు. దీంతో అదుపులోకి తీసుకుని విచారించగా రాత్రి సమయంలో తాళం వేసి ఉన్న షాపుల్లో వరుస చోరీలకు పాల్పడుతున్నట్లు ఒప్పుకున్నాడు. భూతరాజు సందీప్ సాయికేర్ ఆసుపత్రిలో రిసెప్షనిస్టుగా పనిచేస్తున్నాడు. వచ్చిన వేతనం జల్సాలకు సరిపోకపోవడంతో నగరంలో రాత్రి సమయంలో పలు షాపుల్లో చోరీలకు పాల్పడుతున్నాడు. ఆయా షాపుల తాళాలు పగులగొట్టి రూ.4.50 లక్షలు అపహరించాడు. దీంతో పాటు హైదరాబాద్, హనుమకొండలో మూడు బైకులు, మూడు సెల్‌ఫోన్లు చోరీ చేశాడు. ఈ ఘటనలపై గత సంవత్సరం జైలుకెళ్లొచ్చినా తన ప్రవర్తనలో ఎలాంటి మార్పు రాకపోగా తిరిగి చోరీలకు పాల్పడుతున్నాడు. భూతరాజు సందీప్ మొత్తం 21 చోరీలకు పాల్పడినట్లు ఇన్‌స్పెక్టర్ తెలిపారు. నిందితుడిని పట్టుకోవడంలో ప్రతిభకనబర్చిన ఏఎస్సై పాపయ్య, కానిస్టేబుళ్లు అలీ, ప్రభాకర్‌ను ఇన్‌స్పెక్టర్ సత్యనారాయణ రెడ్డి అభినందించారు.



వివరాలు వెల్లడిస్తున్న ఇన్‌స్పెక్టర్ సత్యనారాయణ రెడ్డి

డెంగీ పీడితులకు మెరుగైన వైద్యసేవలు

● వైద్యారోగ్యశాఖ అడిషనల్ డైరెక్టర్ అమర్‌సింగ్
● ఎంజీఎం సందర్శన

ఎంజీఎం : డెంగీ జ్వర పీడితులకు మెరుగైన వైద్య సేవలందించాలని వైద్యారోగ్యశాఖ అడిషనల్ డైరెక్టర్ అమర్‌సింగ్ అన్నారు. ఈ మేరకు శనివారం ఎంజీఎంలోని పలు వార్డులను సందర్శించి డెంగీ జ్వర పీడితులకు అందిస్తున్న చికిత్సలను పరిశీలించారు. అనంతరం ఎంజీఎం సూపరింటెండెంట్ మురళితో కలిసి పలు అంశాలపై చర్చించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డెంగీ మరణాలు సంభవించకుండా డీఎంహెచ్‌ఓ ఆధ్వర్యంలో పీహెచ్‌సీ వైద్యాధికారులు ఎంజీఎం వైద్యులతో ఎప్పటికప్పుడు సమన్వయం చేసుకుంటూ జ్వర పీడితులకు వైద్యసేవలందించాలన్నారు. ఎంజీఎం బ్లడ్‌బ్యాంక్‌లోని రక్తనిధి నిల్వలు ప్లేట్‌లెట్స్ బాధితులకు సరిపోయేలా అందించేందుకు అందుబాటులో ఉంచుకోవాలన్నారు. అనంతరం పీహెచ్‌సీ వైద్యాధికారులతో జూమ్ మీటింగ్ నిర్వహించి వరంగల్ జిల్లాలో డెంగీ, మలేరియా వ్యాధి తీవ్రతను తెలుసుకుని పలు సూచనలు చేశారు.కార్యక్రమంలో డీఎంహెచ్‌ఓ వెంకటరమణ, డిప్యూటీ డీఎంహెచ్‌ఓ గోపాల్‌రావు, ఎంజీఎం ఆర్‌ఎంఓ మురళి, తదితరులు పాల్గొన్నారు.



ఎంజీఎం ఆస్పత్రిలో వార్డును పరిశీలిస్తున్న అడిషనల్ డైరెక్టర్ అమర్‌సింగ్

కలెక్టర్‌ను కలిసిన వైద్యారోగ్య శాఖ అడిషనల్ డైరెక్టర్ అమర్‌సింగ్

వరంగల్: రాష్ట్ర వైద్యారోగ్యశాఖ అదనపు డైరెక్టర్ అమర్‌సింగ్ శనివారం వరంగల్ కలెక్టర్ సత్యశారదను కలెక్టరేట్‌లో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈసందర్భంగా వరంగల్ జిల్లాలో డెంగీ, చికెన్ గున్యా, సీజనల్ వ్యాధులు ప్రబలకుండా నివారించేందుకు తీసుకుంటున్న జాగ్రత్తలు, తీసుకోవాల్సిన చర్యలపై ఇరువురు చర్చించారు. కార్యక్రమంలో డీఎంహెచ్‌ఓ వెంకటరమణ, డిప్యూటీ డీఎంహెచ్‌ఓ గోపాలరావు, ప్రోగ్రాం ఆఫీసర్ మోహన్‌సింగ్, జోనల్ మలేరియా ఆఫీసర్ సునీల్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

జోస్ ఆలుక్కాస్ షోరూం ప్రారంభం



జోస్ ఆలుక్కాస్ షోరూంను ప్రారంభిస్తున్న సినీనటి కీర్తి సురేశ్, ఎమ్మెల్యే రాజేందర్ రెడ్డి, మేయర్ సుధారాణి

● సినీనటి కీర్తి సురేశ్ సందడి

హన్మకొండ: హనుమకొండ నక్కలగుట్టలో ఆభరణాల రిటైల్ రంగంలో అగ్రగామి సంస్థ జోస్ ఆలుక్కాస్ షో రూం ప్రారంభమైంది. శనివారం వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి, మేయర్ గుండు సుధారాణి, ప్రముఖ సినీనటి కీర్తి సురేశ్ ప్రారంభించారు. రెండు ఫ్లోర్లలో ఏర్పాటు చేసిన షో రూంలో బంగారు, వజ్రాభరణాలను ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి, మేయర్ గుండు సుధారాణి, కీర్తి సురేశ్ పరిశీలించారు. ఈ సందర్భంగా ప్రత్యేక అతిథిగా హాజరైన సినీ నటి కీర్తి సురేశ్ అభిమానులకు అభివాదం చేసి మాట్లాడుతూ చారిత్రక, వారసత్వ, పర్యాటక ప్రాంతం వరంగల్‌కు రావడం చాలా సంతోషంగా ఉందన్నారు. జోస్ ఆలుక్కాస్ సంస్థ మేనేజింగ్ డైరెక్టర్లు వర్గీస్ ఆలుక్కా, పాల్ జె ఆలుక్కా, జాన్‌ఆలుక్కా మాట్లాడుతూ హనుమకొండ నక్కలగుట్టలో కొత్తగా ఆభరణాల షోరూం ప్రారంభిస్తున్నందుకు సంతోషంగా ఉందన్నారు. ఈ నెల 17 నుంచి 21వ తేదీ వరకు రూ.60వేల బంగారు, వజ్రాభరణాలు కొనుగోలు చేసిన కస్టమర్లకు ప్రోత్సాహకంగా బంగారు నాణెం ఉచితంగా ఇవ్వనున్నట్లు తెలిపారు. అదనంగా వజ్రాలపై 20 శాతం తగ్గింపు, ప్లాటినం ఆభరణాలపై 7 శాతం తగ్గింపు పొందొచ్చన్నారు. జోస్ ఆలుక్కాస్ షో రూంలో చేసిన ప్రతీ కొనుగోలుపై ఒక బహుమతి ఇస్తున్నట్లు తెలిపారు. జోస్ ఆలుక్కాస్ 60వ వార్షికోత్సవ వేడుకల్లో భాగంగా ఆరు ఎంజీ ఆస్టర్ కార్లు, గృహోపకరణాలు, బంగారు నాణెలతో సహా రూ.6కోట్ల విలువైన బహుమతులు ప్రకటించినట్లు తెలిపారు.



ఆభరణాలు ప్రదర్శిస్తున్న సినీనటి కీర్తి సురేశ్

ఆర్టీసీ బస్సును తప్పించబోయి..

● రోడ్డు పక్కకు ఒరిగిన గ్రానైట్ లారీ
● కిందపడిన రాళ్లు..తప్పిన ప్రమాదం
● ఊపిరిపీల్చుకున్న ప్రయాణికులు

కురవి: ఎదురుగా వస్తున్న ఆర్టీసీ బస్సును తప్పించబోయి మూలమలుపు వద్ద గ్రానైట్ లోడ్‌తో వెళ్తున్న లారీ చెట్టుకొమ్మకు తగిలి అదుపు తప్పి రోడ్డు పక్కకు ఒరిగింది. ఆర్టీసీ బస్సుపై పడే రాళ్లు రోడ్డు పక్కన పడడంతో పెనుప్రమాదం తప్పింది. ఈ ఘటన శనివారం ఉదయం కురవి మండల కేంద్రం శివారు ఖమ్మం వెళ్లే 365/ఏ జాతీయ రహదారిపై జరిగింది. గూడూరు మండలం తీగలవేణిలోని ఓ క్వారీ నుంచి గ్రానైట్ లోడ్‌తో ఓ లారీ ఖమ్మం వెళ్తోంది. ఈ క్రమంలో కురవి శివారులోని గ్యాస్‌గోదాం సమీపంలో మూలమలుపు వద్దకు చేరుకోగానే ఎదురుగా ఖమ్మం నుంచి ఆర్టీసీ బస్సు వచ్చింది. దీంతో గ్రానైట్‌లోడ్ లారీని నడుపుతున్న డ్రైవర్ ఒక్కసారిగా బస్సును తప్పించబోయే క్రమంలో రోడ్డు పక్కన ఉన్న చెట్టు కొమ్మ రాళ్లకు తగిలింది. లోడ్‌తో ఉన్న లారీ అదుపు తప్పి రోడ్డు పక్కన ఉన్న గుంతలో ఒరిగింది. అందులోని రాళ్లు గుంతలో పడ్డాయి. దీంతో బస్సుకు పెనుప్రమాదం తప్పింది. ప్రయాణికులు ఊపిరిపీల్చుకున్నారు.



గుంతలో పడిన రాళ్లు

కొమ్మ విరిగింది.. గూడు చెదిరింది..

● నాలుగు పిట్ట పిల్లలు మృతి

కురవి మండల కేంద్రం శివారులోని గ్యాస్ గోదాం సమీపంలో మూలమలుపు వద్ద గ్రానైట్ లారీపై ఉన్న రాళ్లు పెద్ద చెట్టు కొమ్మను తాకడంతో కొమ్మ విరిగిపోయింది. దీంతో చెట్టు కొమ్మ తొర్రలో పక్షి పెట్టిన గూడు చెదిరింది. అందులో ఉన్న కళ్లు సైతం తెరవని నాలుగుపక్షి పిల్లలు రోడ్డుపై పడిపోయి చనిపోయాయి. ఈ దృశ్యం రోడ్డు ప్రమాదాన్ని చూసేందుకు వచ్చిన జనాల మనస్సులు కలచివేసింది.



చనిపోయిన నాలుగు పక్షి పిల్లలు(సర్కిలోనివి)

నేటి జాతీయ స్థాయి సమావేశానికి బాలిరెడ్డి



అల్లం బాలిరెడ్డి

గీసుకొండ: మండలంలోని జాతీయ ఉత్తమ గ్రామపంచాయతీ మరియపురం మాజీ సర్పంచ్ అల్లం బాలిరెడ్డికి రాజీవ్‌గాంధీ 80వ జయంతి సందర్భంగా నిర్వహించే జాతీయ స్థాయి రౌండ్ టేబుల్ జూమ్ మీటింగ్‌లో పాల్గొనాలని ఆహ్వానం అందింది. రాష్ట్రం నుంచి గ్రామపాలనపై సమావేశంలో పాల్గొనేది బాలిరెడ్డి ఒక్కరే కావడం విశేషం. గడిచిన ఐదేళ్లలో గ్రామాన్ని ప్రజలు, మహిళా పొదుపు సంఘాల సహకారంతో జాతీయ స్థాయిలో ఉన్నతంగా తీర్చిదిద్దిన తీరును ప్రశంసిస్తూ ఆయనను ఈ సమావేశానికి ఆహ్వానించారు. అకాడమీ ఆఫ్ గ్రాస్‌రూట్స్ స్టడీస్ అండ్ రీసెర్చ్ ఆఫ్ ఇండియా(తిరుపతి) ఆధ్వర్యంలో 'రాజీవ్ గాంధీ విజన్ అండ్ మిషన్ ఫర్ ట్రాన్స్‌ఫార్మింగ్ ఇండియా ఇన్ ద ట్వంటీ ఫస్ట్ సెంచరీ' అనే అంశంపై నిర్వహిస్తున్న సమావేశంలో బాలిరెడ్డితో పాటు గ్రామానికి చెందిన పొదుపు సంఘాల మహిళలు ఈ జూమ్ సమావేశంలో పాల్గొననున్నారు. ఆదివారం ఉదయం 10 గంటల నుంచి నిర్వహించే జూమ్ మీటింగ్ కోసం మరియపురంలో ఏర్పాట్లు చేశారు. కాగా, బాలిరెడ్డి సర్పంచ్‌గా విధులు నిర్వహించిన ఐదేళ్ల కాలంలో 8 జాతీయ స్థాయి సదస్సుల్లో పాల్గొన్నారు.

తండ్రి హత్య కేసులో కూతురు, అల్లుడి అరెస్ట్

భూపాలపల్లి అర్బన్: ఆస్తి కోసం తండ్రిని చంపిన ఘటనలో కూతురు, అల్లుడితోపాటు మరో నలుగురిని పోలీసులు అరెస్ట్ చేశారు. సీఐ నరేశ్‌కుమార్ కథనం ప్రకారం.. భూపాలపల్లి పట్టణంలోని కారల్ మార్క్స్ కాలనీకి చెందిన బొమ్మన లక్ష్మారెడ్డి(66) తన ఆస్తిని తన పెద్ద బిడ్డ పేరున రాయించి ఇస్తానని పలుమార్లు చెప్పడంతో చిన్న కూతురు మహేశ్వరి, ఆమె భర్త చంపాలని నిర్ణయించుకున్నారు. ఈ క్రమంలో ఈ నెల 12వ తేదీన తమ ఇంటికి తీసుకెళ్లి అత్యాయత్నానికి పాల్పడగా లక్ష్మారెడ్డికి తీవ్ర గాయాలయ్యాయి. దీంతో ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందాడు. ఈ ఘటనపై పెద్దకూతురు రాజేశ్వరీ ఆమె భర్త జగన్‌మోహన్‌రెడ్డి ఫిర్యాదు మేరకు చిన్న కూతురు మహేశ్వరి ఆమె భర్తతోపాటు ముత్తయ్య, కవ్వాల మహేశ్, శనిగరపు రాజు, లింగాల కృష్ణను అరెస్ట్ చేసి కేసు నమోదు చేసి కోర్టులో హాజరు పరిచినట్లు సీఐ నరేశ్ కుమార్ శనివారం తెలిపారు.